ప్రజారోగ్యానికి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సేవలే ప్రధానం

మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాస్

కూసుమంచి, సెప్టెంబర్ 27: ప్రజారోగ్యానికి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సేవలే ప్రధానమని ఆ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే శుద్ధమైన జలాల పాత్ర చాలా ఉంటుందని అన్నారు. దాని నిర్వహణ సక్రమంగా ఉండాలంటే సిబ్బందిలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది, పంపు ఆపరేటర్లు, ల్యాబ్ అసిస్టెంట్లకు నీటి నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈఈ పుష్పలత అధ్యక్షతన కూసుమంచి రైతువేదికలో శుక్రవారం జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. వృథా నీటిని అరికట్టాలని, మురుగు నీటిని గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు సూచనలు చేశారు. డీఈ మురళీకృష్ణ, జేఈలు రంజిత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

వేంసూరు, సెప్టెంబర్ 27: మండలంలోని చిన్నబీరవల్లి, కుంచపర్తి గ్రామాల్లో శుక్రవారం సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు వీ శ్రీనివాసరెడ్డి పర్యటించి కరివేద పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలను పరిశీలించారు. వాతావరణ పరిస్థితులతో వరిలో దోమపోటు, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు(బీఎల్‌బీ) సంక్రమిస్తాయని, వీటి నివారణకు వరిలో యూరియా వాడకం తగ్గించాలన్నారు. అనంతరం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో యూరియా నిల్వలను పరిశీలించారు. సొసైటీలు, ఆగ్రోస్‌లతో ఎటువంటి యూరియా కొరత లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో వేంసూరు ఏవో రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలుచేయాలి: బీఆర్ఎస్

మాట్లాడుతున్న పోలెపొంగు వెంకటేశ్వర్లు

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 27: తిరుమలాయపాలెంలోని 100 బెడ్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు పోలెపొంగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై విపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలాయపాలెంలో మాతా, శిశు సంక్షేమ హస్పిటల్‌ను ఏర్పాటుచేస్తామని మంత్రి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చినందున వెంటనే ఆ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేశారు. పలు పార్టీల నాయకులు పగిడిపల్లి బాబు, మట్టే నాగేశ్వరావు, చింతిరాల నాగభూషణం, కొమ్ము పుల్లయ్య, గుగ్గిళ్ల అశోక్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తాచాటిన మైనార్టీ విద్యార్థులు

కొణిజర్ల, సెప్టెంబర్ 27: ఇటీవల ఖమ్మం అర్బన్ మండలం సౌత్‌జోన్ పరిధిలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఖమ్మం మైనార్టీ బాలుర గురుకుల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ ఎల్ జితేశ్‌షాహిల్ తెలిపారు. అండర్-17 విభాగంలో కబడ్డీ, ఖోఖోలలో ప్రథమ స్థానం, అండర్-14 వాలీబాల్ ద్వితీయ, అండర్-17 అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్ ప్రథమ, 100 మీటర్లు, 400 మీటర్లలో తృతీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను, ప్రిన్సిపాల్, పీడీ రవికుమార్, పీఈటీ హరీశ్, సిబ్బంది అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొణిజర్ల, సెప్టెంబర్ 27: మూడు రోజులుగా తల్లాడ మండలంలోని డాన్‌బాస్కో పాఠశాలలో నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీల్లో సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి వివిధ విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 29, 30, అక్టోబర్ 1 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు. బాలుర విభాగం అండర్-14లో 8వ తరగతి విద్యార్థులు టీ తేమంత్, బాలికల విభాగంలో సీహెచ్ రాజేశ్వరి, ఎస్‌కే హసినా, పీ శ్రావణి, బీ అఖిల, అండర్-17 విభాగంలో బాలికలు ఎస్‌కే సానియా, కే భారతి, వై దివ్య, అథ్లెటిక్స్‌లో జీ సిరి, బీ అఖిల, ప్రశాంత్ ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం కనకపూడి లక్ష్మీనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, చైర్మన్ ఎస్‌కే జహీద, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

పత్తి, వరి పంటలను పరిశీలించిన అధికారులు

మధిర రూరల్, సెప్టెంబర్ 27: మండలంలోని ఇల్లెందులపాడు గ్రామంలో రైతులు సాగుచేసిన పత్తి, వరి పంటలను మధిర ఏడీఏ విజయచంద్ర, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రుక్మిణి, నాగస్వాతి, ఏవో శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. అలాగే వరి పంటను కూడా పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

పంట పొలాల క్షేత్రస్థాయి సందర్శన

రఘునాథపాలెం, సెప్టెంబర్ 27 : మండలంలోని పత్తి, మిర్చి, వరి పంటలను ఖమ్మం డివిజన్ వ్యవసాయ అధికారి కొంగర వెంకటేశ్వర్లు శుక్రవారం క్షేత్రస్థాయి సందర్శన చేపట్టారు. పత్తిలో రసం పీల్చే పురుగులు పచ్చదోమ, పేనుబంక, పిండి నల్లి ఏర్పాటును గుర్తించి నివారణకు పలు సూచనలు చేశారు. వీ వెంకటాయపాలెంలో ఏఈవో సాయి శిరణ్మయి రైతులతో కలిసి ప్రత్యక్షంగా పంటలను సందర్శించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పసుమర్తి అనిల్ కుమార్**, S/o : **వెంకటేశ్వర్లు, వయస్సు** : 43 సం||లు, **వృత్తి** : వ్యాపారం, **నివాసం** : ఇ.నెం. 10-3-122, మామిళ్ళగూడెం, ఖమ్మం నగరము, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా అశ్యూరెన్సుల రిజిష్ట్రారు మరియు ఖమ్మం రూరల్ సబ్ రిజిష్ట్రారు వారి అధికార పరిధిలో ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్, ఖమ్మం రూరల్ మండలం, పెద్దతండ గ్రామ పంచాయితీ పరిధిలో, ఏదులాపురం రెవిన్యూ గ్రామ స.నెం. 99, 100, 105/1, 105/2, 106/2/1, 106/2/2, 107/3/1 మరియు 107/3/2 మిం.లే., ప్లాటు నెం. 321 ఖాళీ స్థల విస్తీర్ణం. 175-00 చ||గ||లు = 146-32 చ||మీ||లు, **డాక్యుమెంట్ నెం. 5124/2022** గల స్థిరాస్తికి హద్దులు : **తూర్పు:** ప్లాటు నెం. 363, **పడమర :** 30'-0'' వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం :** ప్లాటు నెం. 322, **దక్షిణం :** ప్లాటు నెం. 320.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

స్వచ్ఛంద సేవకుడు చంద్రమౌళి మృతి

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 27: కోఆపరేటివ్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగి, స్వచ్ఛంద సేవకుడు చంద్రమౌళి (80) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. సత్తుపల్లి బస్టాండ్‌లో స్వచ్ఛందంగా ఎటువంటి జీతభత్యాలు లేకుండా బస్సుల రాకపోకలకు సంబంధించిన సమాచారాన్ని ప్రయాణికులకు చెబుతుండేవాడు. చంద్రమౌళి మృతిపట్ల సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి, సీఐ విజయలక్ష్మి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి చంద్రమౌళి భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చంద్రమౌళికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

గర్భిణులు పోషక విలువల ఆహారం తీసుకోవాలి

ఎమ్మెల్యే మట్టా రాగమయి

పెనుబల్లి: గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, సెప్టెంబర్ 27: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు ప్రాజెక్టు పరిధిలోని చిన్నకోరుకొండిలో కల్లూరు మండల సీడీపీవో ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాహార లోపాలను తగ్గించుట, శిశువు బరువు సరైన విధంగా ఉండే ఆహార నియమాలపై అవగాహన నిర్వహించారు. అనంతరం కల్లూరు సీడీపీవో ఆధ్వర్యంలో 25 మందికి సీమంతాలు, 20 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, ఆరుగురికి అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, కల్లూరు సీడీపీవో జ్యోతి, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, నాయకులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సేవలు అభినందనీయం

సత్తుపల్లి, సెప్టెంబర్ 27: గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం కల్లూరు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కల్లూరు ప్రాజెక్టు సీడీపీవో నిర్మలజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రీయ పోషణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చిన్నతనం నుంచి క్రమశిక్షణతో నేర్చుకునే విద్య బంగారు భవిష్యత్‌కు బాట అవుతుందన్నారు. సీడీపీవో నిర్మలజ్యోతి మాట్లాడుతూ నూతనంగా రూపొందించిన ప్రీస్కూల్ సిలబస్‌తో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధనకు శ్రీకారం చుట్టామన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి చీర, సారె అందించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ నీరజాచౌదరి, మెడికల్ ఆఫీసర్ నవ్యకాంత్, ఎంఈవో నివేదిత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, రత్తమ్మ, మెహరున్నిస్సా బేగం, కొమ్మినేని బాబు, నాయకులు పాల్గొన్నారు.

రూ.5.91 కోట్లకు సోషల్ ఆడిట్

తప్పులు దొర్లితే చర్యలు తీసుకుంటాం : ఏపీడీ శిరీష

కూసుమంచిలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న ఏపీడీ శిరీష

కూసుమంచి, సెప్టెంబర్ 27: 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 41 పంచాయతీల్లో జరిగిన రూ.5.91 కోట్ల విలువైన ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఏపీడీ శిరీష తెలిపారు. ఆడిట్‌లో ఎక్కడైనా తప్పిదాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కూసుమంచి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన ప్రజావేదికలో ఏపీడీ మాట్లాడారు. ప్రతీ గ్రామంలో చేపట్టిన పనులను సోషల్ ఆడిట్ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. నాణ్యతలోగానీ, నగదు చెల్లింపుల్లోగానీ తప్పులు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు వీరయ్య, శ్రీదేవి, పవన్, శాస్త్రి, అభిలాశ్, అప్పారావు, కరుణ, సాంబశివచారి, కాశన్న పాల్గొన్నారు.

బాషబోయిన వీరన్న విడుదల

వీరన్న దంపతులను పరామర్శిస్తున్న కందాళ, సండ్ర

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 27: కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో పోలీసులు బనాయించిన అక్రమ కేసులో జైలుకు వెళ్లిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న బెయిల్‌పై శుక్రవారం విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన.. స్వగ్రామం జల్లేపల్లికి చేరుకోగానే బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య తదితరులు జల్లేపల్లికి వచ్చి బాషబోయిన వీరన్న, శైలజ దంపతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల అధ్యక్షుడిగా వీరన్న మండలంలో పార్టీ బలోపేతానికి, సర్పంచ్‌గా అతడి భార్య శైలజ జల్లేపల్లి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని వివరించారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేకనే వీరన్నపైనా, మరికొంతమంది పార్టీ కార్యకర్తలపైనా అక్రమ కేసులు బనాయించారని అన్నారు. అక్రమ కేసులతో జైలుకు పంపడం హేయమైన చర్య అని అన్నారు. కార్యకర్తలకు పార్టీ నేతలుగా తాము ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మండల నాయకులు చావా వేణు, చామకూరి రాజు, ఆర్మీ రవి, ఆలిస్యం నాగేశ్వరరావు, బోడా మంచానాయక్, కొప్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచికి 100 బెడ్ల ఆసుపత్రి మంజూరు

కూసుమంచి, సెప్టెంబర్ 27: కూసుమంచి మండలానికి 100 బెడ్ల ఆసుపత్రిని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంజూరు చేసింది. అటు సూర్యాపేట - ఖమ్మం మధ్యగానీ, ఇటు మరిపెడ - నేలకొండపల్లి మధ్యగానీ సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఎక్కడా పెద్ద ఆసుపత్రి లేకపోవడం, హైవే ఉన్నందున వంద బెడ్ల ఆసుపత్రి అనివార్యం కావడం వంటి కారణాలతో ఇక్కడ ఈ ఆసుప్రతిని నిర్మిస్తామని మంత్రి పొంగులేటి గతంలోనే చెప్పారు. నాయకన్‌గూడెం రైతు వేదిక వద్ద, గట్టుసింగారం కేజీబీవీ వద్ద స్థలాలను పరిశీలించారు. గట్టుసింగారం వద్ద ఉన్న భూమి అనువుగా ఉందని గుర్తించి 5.10 ఎకరాల భూమిని ఈ ఆసుపత్రికి కేటాయించారు. సూర్యాపేట - ఖమ్మం హైవేపై నేలకొండపల్లి - కూసుమంచి రోడ్డులో జాతీయ రహదారికి కిలోమీటరు దూరంలోనే ఈ స్థలం ఉంది.

వరద బాధితులకు గ్యాస్‌పొయ్యిలు, బియ్యం పంపిణీ

గ్యాస్‌పొయ్యిలు, రైస్‌కిట్లను అందజేస్తున్న యుగంధర్

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 27 : వరద బాధితులకు మిత్ర ఫౌండేషన్ ఆపన్నహస్తం అందించింది. 650 కుటుంబాలకు రూ.10 లక్షల విలువైన గ్యాస్‌పొయ్యిలు, బియ్యం పంపిణీ చేశారు. శుక్రవారం నగరంలోని వాసవీగార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ మాట్లాడుతూ.. మిత్ర ఫౌండేషన్ చొరవ అభిందనీయమన్నారు. గతంలో భద్రాచలం వరద బాధితులకు రూ.11 లక్షల విరాళం ప్రకటించినట్లు ఫౌండేషన్ బాధ్యుడు కురువెళ్ల ప్రవీణ్ చెప్పారు. ఫౌండేషన్ సభ్యులు చారు గుండ్ల రవికుమార్, పాలవరపు శ్రీనివాస్, చెరుకూరి యుగంధర్, నగేష్, శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

రఘునాథపాలెం, సెప్టెంబర్ 27 : ఖమ్మం నగరం జూబ్లీపురం ప్రాంతానికి చెందిన కాంపల్లి మునుస్వామి అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలిసిన డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ శుక్రవారం అతడి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. మునుస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కన్నం రమేశ్, గోనేల రవిశంకర్, సీతరాములు, గోనెల సునీత, వలి, జ్ఞానేశ్వర్, సంతోశ్ పాల్గొన్నారు.

యువ టూరిజం క్లబ్ ప్రారంభం

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 27 : నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా యువ టూరిజం క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా క్లబ్‌లోగో, లక్ష్యాలను ఆవిష్కరించారు. యువతలో టూరిజం, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగించడం, పర్యాటకరంగ ప్రోత్సాహం, దేశ వారసత్వ పరిరక్షణకు క్లబ్ సభ్యులందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ రమణ, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ రమాసత్యావతి, జి వీరన్న పాల్గొన్నారు.

స్థల పరిశీలన

బోనకల్లు, సెప్టెంబర్ 27: మండల కేంద్రంలో ఇందిరా డెయిరీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని డీఆర్‌డీవో సన్యాసయ్య శుక్రవారం పరిశీలించారు. ఇదే కేంద్రాన్ని ముందుగా రావినూతల గ్రామంలో ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తించారు. ఆ స్థలం అనుకూలంగా లేకపోవడంతో మండల విద్యావనరుల కేంద్రం సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీంచారు. తహసీల్దార్ పున్నంచందర్, ఏపీఎం పద్మలత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నివాళి

మధిర, సెప్టెంబర్ 27: పట్టణంలోని ఇద్దరు మృతిచెందగా వారి భౌతికకాయాలకు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు చిన్నం నరసింహారావు, పల్లబోతుల సావిత్రమ్మ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు మృతుల నివాసాలకు వెళ్లి వారి భౌతికకాయాలపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మొండితోక జయాకర్, రావూరి శ్రీనివాసరావు, పల్లబోతుల వెంకటేశ్వర్లు, రంగిశెట్టి కోటేశ్వరరావు, బిక్కి కృష్ణప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు నేడు బస్‌పాస్ మేళా

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 27: మండలంలోని దివ్యాంగులకు ఎర్రుపాలెం పంచాయతీ కార్యాలయంలో శనివారం బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్‌టీసీ మధిర డిపో మేనేజర్ శంకర్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ బస్‌పాస్‌లతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో 50 శాతం రాయతీతో తెలంగాణ రాష్ట్రమంతటా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంపలగూడెం మీదుగా హైదరాబాద్‌కు బస్సు

వైరాటౌన్, సెప్టెంబర్ 27: ఏపీలోని తిరువూరులో రాత్రి 8.45 గంటలకు సర్వీస్ నెంబర్ 3828తో సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి గంపలగూడెం, పెనుగొలను, నెమలి, పినపాక, వైరా, ఖమ్మం, సూర్యాపేట మీదుగా హైదరాబాద్ మియాపూర్‌కు ఉదయం 5.15 గంటలకు చేరుకుంటుందని తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి సర్వీస్ నెంబర్ 3829తో రాత్రి 9.30గంటలకు మియాపూర్‌లో బయలుదేరి అదే రూట్‌లో నెమలి, గంపలగూడెం మీదుగా ఉదయం 6.00 గంటలకు తిరువూరు చేరుకుంటుందన్నారు.

పాల ప్యాకెట్ల పక్కదారిపై విచారణ

రఘునాథపాలెం, సెప్టెంబర్ 27 : ఖమ్మం మున్నేరు వరద బాధితుల టెట్రా పాల ప్యాకెట్ల పక్కదారిపై ఖమ్మం అర్బన్ తహసీల్దార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఖమ్మం సారధినగర్ రామాలయం వద్ద గల ఓ ఇంట్లో మున్నేరు వరద బాధితుల సహాయార్థం తెచ్చిన టెట్రా పాల ప్యాకెట్ బాక్సులు పెద్ద మొత్తంగా నిల్వ చేసి ఉంచడంపై 'నమస్తే తెలంగాణ' శుక్రవారం 'వరద బాధితుల పాల ప్యాకెట్లు పక్కదారి' పేరుతో కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన కలెక్టర్ తహసీల్దార్ స్వామిని విచారణకు ఆదేశించారు. తహసీల్దార్ తన కార్యాలయ సిబ్బందిని పాల ప్యాకెట్లు నిల్వ ఉన్న ఇంటి వద్దకు పంపారు. అయితే పత్రికలో కథనాన్ని గుర్తించిన సదరు ఇంటి యజమాని పెంట్‌హౌస్ గదిలో రహస్యంగా దాచిఉంచిన పాల ప్యాకెట్ల బాక్సులను అప్పటికే మాయం చేశాడు. దీంతో ఇంటి యజమానిని ఆఫీస్‌కు రావాలని తహసీల్దార్ స్వామి ఆదేశించినట్లు తెలిసింది.

రేపు మద్దులపల్లి ఏఎంసీ ప్రమాణ స్వీకారం

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 27: ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు మద్దులపల్లి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన బైరు హరినాథబాబు తెలిపారు. మార్కెట్ సముదాయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు.

వరద బాధితులకు గీతాంజలి విరాళం

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 27 : నగరంలోని గీతాంజలి పాఠశాల విద్యార్థులు వరద బాధితుల కోసం శుక్రవారం విరాళం అందించారు. కలెక్టర్ తలపెట్టిన 'నా ఖమ్మం కోసం నేను' కార్యక్రమానికి స్పందించి రూ.30 వేలను అందజేశారు. ఆ మొత్తం చెక్కును కలెక్టర్‌కు పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు, డైరెక్టర్ టీ అరుణ్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు.

బస్‌షెల్టర్‌లే.. బడ్డీ కొట్టు!

వైరారూరల్, సెప్టెంబర్ 27 : ప్రయాణికుల సౌకర్యార్థం రెబ్బవరం గ్రామంలో ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను కొందరు ఆక్రమించుకొని బడ్డీ కొట్టు, కిరాణా దుకాణం నడుపుతున్నారు. దీంతో సుదూర ప్రాంతాలు, గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు రోడ్డు పక్కనే నిల్చొని బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే వాటిని తొలగించి.. ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ ఉపయోగపడే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 27 : నగరంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిళ్ల పంపిణీ నిర్వహించారు. 60 మందికి సైకిళ్లను ఆదరణ పథకం కింద అందించినట్లు తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం డాన్‌బాస్కో, కాట్రగడ్డ ప్రశాంత్, శశికాంత్ వల్లేపల్లి పాల్గొన్నారు.

అనుమానస్పదస్థితిలో యువకుడి మృతి

కారేపల్లి (కామేపల్లి), సెప్టెంబర్ 27: యువకుడు అనుమానస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కామేపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గోవింద్రాలకు చెందిన ఆలోత్ బావ్‌సింగ్(33) గ్రామ సమీపంలోని డొంకరోడ్డుపై తీవ్రగాయాలతో మృతి చెందిన్నాడు. సీఐ తిరుపతిరెడ్డి కామేపల్లి ఎస్సైతో కలిసి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన యువకుడు దివ్యాంగుడు కాగా ఒంటిపై తీవ్రగాయాలున్నట్లు గుర్తించారు. దుండగులు బీరుసీసాలతో పొడిచి చంపినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ప్రత్యేకబృందంతో ఆధారాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు పేర్కొన్నారు.

సీతారామపురం వద్ద రోడ్డు ప్రమాదం

పెనుబల్లి, సెప్టెంబర్ 27: మండలంలోని సీతారామపురం వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో బస్సులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెనుబల్లి మండలం సీతారామపురం వద్ద హైదరాబాద్ నుంచి ఏలూరు జిల్లా చెక్కపల్లికి వెళ్తున్న బస్సు ముందు ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. పోలీసులు సమాచారం అందుకొని ఘటన స్థలానికి చేరుకున్నారు. బస్సు ఎమర్జన్సీ గేటును ఓపెన్ చేసి అందులో నుంచి ప్రయాణికులను బయటకు తీసి పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు.

రామారావు మృతదేహం కోసం గాలింపు చర్యలు

వేంసూరు, సెప్టెంబర్ 27: మండలంలోని దుద్దేపూడి గ్రామపంచాయతీ తుంగావారికాలనీకు చెందిన తుంగా రామారావు బుధవారం మున్నేరువాగులో కొట్టుకుపోయిన విషయం విధితమే. శుక్రవారం ఉదయం వరకు ఆచూకీ దొరకకపోవడంతో వైరా మత్స్యశాఖకు సంబంధించిన గజఈతగాళ్లను అధికారులు పిలిపించి సాయంత్రం వరకు ఆంధ్రా ప్రాంతంలోని మంకొల్లు ప్రాజెక్టు వరకు గాలించారు. అయినప్పటికీ ఆచూకీ తెలియలేదు. ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి రామారావు మృతదేహం ఆచూకీ తెలుసుకునేలాగా చూడాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

సిరిపురం ఎస్‌బీఐలో చోరీకి యత్నం

మధిర, సెప్టెంబర్ 27: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిరిపురం బ్రాంచ్‌లో దుండగులు గురువారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. బ్యాంకు వెనుక వైపు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. లాకర్‌ను కూడా పగులగొట్టేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో లాకర్ల అలెర్ట్ అలారం మోగడంతో ఆ దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. శుక్రవారం ఉదయం బ్రాంచ్ మేనేజర్ ఉమేశ్‌కుమార్‌యాదవ్ బ్యాంకును తెరవగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దీంతో చోరులు దొంగతనానికి ప్రయత్నించినట్లు గుర్తించి వెంటే స్థానిక పోలీసులకు సమాచారాన్ని అందించారు. మధిర పట్టణ ఎస్సై సంధ్య హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని విషయాన్ని వైరా ఏసీపీకు తెలియజేశారు. వైరా ఏసీపీ రెహమాన్ కూడా అక్కడికి వచ్చి క్లూస్‌టీంతో కలిసి పరిశీలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

వ్యాపారి దివాళా పిటిషన్ దాఖలు

ఖమ్మం లీగల్, సెప్టెంబర్ 27 : ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన తోడేటి వెంకన్న ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 81 లక్షల రూపాయలకు దివాళా పిటిషన్ దాఖలు చేశాడు. పిటిషన్‌లోని వివరాల ప్రకారం.. వెంకన్న ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ, దానితోపాటు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి దుస్తుల వ్యాపారం చేస్తూ ఉండేవాడు. అదేవిధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేసేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో దివాళా పిటిషన్‌లో 52మంది రుణదాతలను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసిన ఐటీడీఏ పీవో

కారేపల్లి, సెప్టెంబర్ 27: కారేపల్లి మండలం పొలంపల్లితండాకు చెందిన భూక్యా సునీల్‌కుమార్ భోపాల్‌లో ఐఐఐటీ నభ్యసిస్తున్నాడు. అతడు సాంకేతిక పరికరాల కోసం పేదరికంతో ఇబ్బందులు పడుతుండటంతో పీఏస్‌ఆర్ యూత్ అధ్యక్షుడు జర్పుల ధోనీనాయక్ ఐటీడీఏ పీవో రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఐటీడీఏ పీవో రాహుల్ సునీల్‌కుమార్‌కు ల్యాప్‌టాప్‌ను శుక్రవారం అందజేశారు.

పెనుబల్లి వైద్యశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

పెనుబల్లి, సెప్టెంబర్ 27: పెనుబల్లి వైద్యశాలను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించారు. వైద్యశాల పరిసరాల్లో తిరిగి ఎప్పటికప్పుడు పరిశుభ్రత చేపట్టాలని తెలిపారు. రోగులకు సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. రికార్డులు పూర్తిస్థాయిలో ఉండాలని, రోగుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ

జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య
వరి, పత్తి, మిర్చి పంటల పరిశీలన


వరి పైరును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

చింతకాని, సెప్టెంబర్ 27: ఇటీవల కురిసిన వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితులతో పంటల్లో తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉన్నదని, దీని నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ధంసారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి, పత్తి, మిర్చి పంటలను పరిశీలించిన ఆయన తెగుళ్ల ఉధృతిని గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిర్చి పంట పూత దశలో ఉందని, పూత, కాయ దశలో రసం పీల్చు పురుగులైన తామర పురుగు, తెల్లదోమ, ఎర్రనల్లి ఎక్కువగా ఆశించే ఆస్కారం ఉంటుందన్నారు. తామర పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసంపీల్చడం వల్ల ఆకులు పైకి ముడుచుకు పోతాయని, పూత, పిందె రాలిపోతుందని తెలిపారు. ఎర్రనల్లి పురుగు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వల్ల కిందికి ముడత వస్తుందని పేర్కొన్నారు. జెమినీ వైరస్ వల్ల మొక్కల ఆకులు చిన్నవిగా మారి పైకి ముడుచుకొని పడవ ఆకారంలో ఉంటాయన్నారు. తెల్లదోమ వల్ల ఆకుల ఈనెల మధ్య ఆకుపచ్చగా, ఈనెల మధ్య లేత ఆకుపచ్చగా ఉండి కణుపు మధ్య దూరం తగ్గి, ఆకుల మధ్య బొబ్బర్లుగా ఏర్పడి ముడుచుకుంటాయని పేర్కొన్నారు.

తెల్లదోమ, ఎర్రనల్లి, తామర పురుగుల నివారణ...

రసంపీల్చు పురుగులైన తెల్లదోమ, ఎర్రనల్లి, తామర పురుగుల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పుల్లయ్య సూచించారు. పొలంలో గ్రీజుపూసిన పసుపు రంగు అట్టలను అక్కడక్కడ ఉంచితే తెల్లదోమ ఉధృతిని కొంతవరకు తగ్గించవచ్చని, గట్లపైన వైరస్‌కు స్థావరాలైన కలుపు మొక్కలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. పొలం చుట్టూ 2 నుంచి 3 వరుసల్లో రక్షణ పంటలుగా సజ్జ, జొన్న వేసుకోవాలని, తెగుళ్లు సోకిన మొక్కలను పీకి కాల్చివేయాలన్నారు. వీటి నివారణకు ముందుగా 5 శాతం వేపగింజల కషాయంను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే పిప్రోనిల్ 2 ఎంఎల్ లేదా సైఏనోశాడ్ 0.25 ఎంఎల్ లేదా స్పైన్‌టోరం 1 ఎంఎల్ లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో మార్చిమార్చి పిచికారీ చేయాలన్నారు.

వరిలో ఎండాకు తెగులు

వరి పంటకు బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఆశించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలిపారు. దీని నివారణకు.. తాత్కాలికంగా నత్రజని ఎరువులు వేయడం ఆపాలని, తెగులు వ్యాప్తిని అరికట్టేందుకు అగ్రిమైసిన్ 0.2 గ్రాములు లీటరు నీటిలో లేదా ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తిలో ప్రస్తుతం సెర్కోస్పోరం, ఆల్టనేరియా ఆకుమచ్చ తెగుళ్లు ఆశించే ఆస్కారం ఉందని, నివారణకు ప్రొఫికోనోజోల్ 1 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణకు ట్రైకోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. తెగుళ్లు సోకే సమయంలో నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.